క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో విద్యార్థుల రికార్డు

కేఎల్‌హెచ్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆకెళ్ల రామకృష్ణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): కేఎల్‌హెచ్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్ విద్యార్థులు అత్యుత్తమ వార్షిక ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్‌లు సాధించారని యూనివర్సిటీ డైరెక్టర్ ఆకెళ్ల రామకృష్ణ తెలిపారు. బుధవారం నగరంలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం రూ.75 లక్షల వార్షిక ప్యాకేజీతో తమ విద్యార్థి ప్లేస్‌మెంట్ సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. రూ.20లక్షల నుంచి రూ.50లక్షల్లోపు వార్షిక ప్యాకేజీతో సూపర్ డ్రీమ్, డ్రీమ్ కంపెనీలలో తమ విద్యార్థులు ప్లేస్‌మెంట్ పొందినట్లు వివరించారు. అంతే కాకుండా జర్మనీ, జపాన్, సింగపూర్, మలేషియా, దుబాయ్ తదితర దేశాల్లో సైతం మంచి ప్యాకేజీలతో తమ విద్యార్థులు ప్లేస్‌మెంట్‌లను దక్కించుకున్నట్లు రామకృష్ణ తెలిపారు.

ఘనంగా హోమియో ఫెస్ట్

ఖైరతాబాద్, ఏప్రిల్ 30: హోమియో వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతి సందర్భంగా ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన 'హోమియో ఫెస్ట్' ఘనంగా జరిగింది. హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఫెస్ట్‌ను కేవిన్‌ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పీవీ నందకుమార్ రెడ్డి, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మినారాయణతో కలిసి ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో మాజీ కేంద్రంమంత్రి సముద్రాల వేణుగోపాలచారి, ప్రముఖ సినీ దర్శకుడు మారుతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ హోమియో వైద్యులు, పూర్వ హోమియో విభాగం అదనపు సంచాలకుడు డాక్టర్ శివశంకర్ కూనపరెడ్డిని అతిథులు సత్కరించారు. డాక్టర్లు గోపాలకృష్ణ, దుర్గాప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులు కేఎస్ గుప్తా, ఆనందరావు, మధు వారణాసి, మాణిక్ ప్రభు, వేణుగోపాల్‌గౌరి పాల్గొన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా గాంధీ.. ఉస్మానియా

2022లో కేసీఆర్ హయాంలో పునాది

టైప్-1 మధుమేహ చిన్నారులకు సంపూర్ణ భరోసా

పూర్తిస్థాయిలో ఉచితంగా ఇన్సులిన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 30, (నమస్తే తెలంగాణ): టైప్-1 మధుమేహం బారిన పడిన చిన్నారులకు భరోసా లభించనుంది. ప్రభుత్వమే ఉచితంగా ఇన్సులిన్, అధునాతన వైద్య సేవలందించనుంది. టైప్-1 మధుమేహం చికిత్సలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లోని 14 ఆసుపత్రులను కేంద్రం ఎంపిక చేసింది. హైదరాబాద్‌లోని గాంధీ జనరల్ ఆసుపత్రి, ఉస్మానియా జనరల్ ఆసుపత్రులు ఉండటం విశేషం. తెలంగాణలో 2022లోనే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిన కేసీఆర్ సర్కార్ గాంధీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు పునాదులు వేసింది.

కేసీఆర్ పాలనలోనే పునాదులు..

గాంధీ ఆసుపత్రికి ఇప్పటివరకు టైప్-1 మధుమేహంతో బాధపడుతూ 550 నుంచి 600 మంది చిన్నారులు వైద్యులను సంప్రదించారు. 2012లో ఓ స్వచ్ఛంద సంస్థ బాధితులను గుర్తించి వారికి చికిత్సనందించడం మొదలుపెట్టారు. ఈ క్రమంగా సంఖ్య పెరగడం మూలంగా కేసీఆర్ సర్కార్ దృష్టి సారించింది. 2022లో తొలిసారిగా గాంధీ ఆసుపత్రిలో ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించింది. ఉస్మానియాలో సైతం టైప్-2 డయాబెటిక్ బాధితుల కోసం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో డయాబెటిక్ ఫూట్ కేర్ క్లినిక్ ను ఏర్పాటు చేసింది. డయాబెటిక్ రోగులకు వైద్య సేవలందించడంలో బీఆర్ఎస్ సర్కార్ ఎంతో కృషి చేసింది. నాడు ప్రారంభించిన సేవల ఫలితమే నేడు గాంధీ, ఉస్మానియాలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా కేంద్రం ప్రకటించింది.

అధునాతన వైద్య సేవలు..

2 ఏండ్ల నుంచి 25 ఏండ్ల లోపు వయస్సు ఉన్నవారందరూ టైప్-1 మధుమేహంతో బాధపడుతున్నారు. ఆటో ఇమ్యునో డిసీజ్ ద్వారా వ్యాపించి, శరీరంలోని ప్యాంక్రియాస్ ఇన్సులిన్ ఉత్పత్తిని ఆపేస్తుంది. దీంతో కచ్చితంగా ఇన్సులిన్ అవసరమేర్పడుతుంది. సరిగ్గా తినకపోవడం, నిద్రలేకపోవడం, చికాగుగా ఉంటడం వంటి లక్షణాలు వారిలో కనిపిస్తుంటాయి. రోగం 60 శాతానికి పైగా వ్యాపించిన తరువాతనే వైద్యులను సంప్రదిస్తున్నారు. ఇతర ఆసుపత్రుల్లోనైతే నెలకు రూ 4 వేలు పెట్టి మరీ ఇన్సులిన్‌ను కొనుగోలు చేసుకుంటున్న పరిస్థితి బాధితులకు ఎదురవగా, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వల్ల రూపాయి ఖర్చు లేకుండా పూర్తిస్థాయిలో ఉచితంగానే ఇన్సులిన్లు ఇస్తూ, అధునాతన వైద్య సేవలందించనున్నారు. డయాబెటిస్ వచ్చిన పిల్లలను పరీక్షించడంతో పాటు అనుమానాల నివృత్తి కోసం వారి తల్లిదండ్రులు, అన్నదమ్ములకు పరీక్షలు నిర్వహిస్తారు.

అవగాహన ముఖ్యం

టైప్-1 డయాబెటిక్ లక్షణాలు తమ పిల్లల్లో కనిపిస్తే తల్లిదండ్రులు గుర్తించి వైద్యుడిని సంప్రదించాలి. నియంత్రణలో భాగంగా దానిపై అవగాహన అత్యంత అవసరం. గాంధీలో అధునాతన పద్ధతుల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా పరిశోధనలు చేసి టైప్-1 నియంత్రణకు కృషి చేస్తున్నాం.

- డాక్టర్ విజయశేఖర్ రెడ్డి,
ఎండోక్రైనాలజీ హెచ్‌ఓడీ గాంధీ ఆసుపత్రి

బసవేశ్వర విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బసవేశ్వరుడి భావజాలమే మార్గదర్శకం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులు

కవాడిగూడ, ఏప్రిల్ 30: సమాజం బాగుంటేనే అందరూ బాగుంటారన్న భావజాలం కలిగిన మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం, వీరశైవ సమాజం సికింద్రాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బసవేశ్వర విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో లింగాయత్ సామాజికవర్గం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని గుర్తు చేశారు. బసవేశ్వరుని విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్, మాజీ ఎంపీ బీబీపాటిల్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ మాడపు వీరమల్లేశ్ తదితరులు జయంతి వేడుకల్లో వేర్వేరుగా పాల్గొని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఎం.చంద్రశేఖర్, ఉప సంచాలకులు జి.ఆశన్న, లింగాయత్ ప్రతినిధి కోట గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో త్రివేణి పాఠశాల ఉపాధ్యాయులు

ఎస్ఎస్‌సీ ఫలితాల్లో త్రివేణి హవా

సిటీబ్యూరో, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఎస్ఎస్‌సీ-2025 ఫలితాల్లో త్రివేణి టాలెంట్ స్కూల్స్ విద్యార్థులు సత్తా చాటారు. టాప్ మార్కులతో త్రివేణి సంచలన రికార్డును సొంతం చేసుకున్నది. ఈ సందర్భంగా త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ డా.గొల్లపూడి వీరేంద్ర చౌదరి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... త్రివేణి అన్ని బ్రాంచ్‌లలోని విద్యార్థులు ఎస్ఎస్‌సీలో 600 మార్కులకు గానూ 593 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారని తెలిపారు. అలాగే టాప్ మార్కులతో ముందు వరుసలో ఉన్నారని, 570 మార్కులకు పైగా 61మంది విద్యార్థులు, 550 మార్కులకు పైగా 200 మంది, 500కు పైగా మార్కులను 686మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. మార్కులు, గ్రేడింగ్ విధానంలో రెండింటిలోనూ త్రివేణికి తిరుగులేదన్నారు. 100శాతం ఉత్తీర్ణత పొందిన బ్రాంచ్‌లే ఎక్కువ ఉన్నాయని, తెలంగాణలో త్రివేణి నెంబర్-1గా నిలిచిందన్నారు. ఎస్ఎస్‌సీ ఫలితాల్లో కేవలం మార్కులకే పరిమితం కాకుండా జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన ఐఐటీ, నీట్, జేఎస్ఓ, ఎన్‌టీఎస్‌సీ, ఒలింపియాడ్ వంటి పోటీ పరీక్షల్లోనూ బలమైన పునాది వేస్తున్నట్లుగా తెలిపారు. ఎస్ఎస్‌సీలో విజయం సాధించిన విద్యార్థులకు, ప్రోత్సహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు, బోధనా, బోధనేత సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

కమిషనర్‌కు మొక్క బహూకరిస్తున్న జేఏసీ నాయకులు

ఆటో కార్మికులకు రాంకీ వేధింపులు

సమస్య పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు జేఏసీ నేతల వినతి

సిటీబ్యూరో, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ): స్వచ్ఛ ఆటో కార్మికులను రాంకీ సంస్థ.. వేధింపులకు గురిచేస్తోందని కార్మికుల జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను జేఏసీ నాయకులు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ''గ్రేటర్ హైదరాబాద్‌లో 30 ఏళ్లుగా ఇంటింటి చెత్త సేకరణ చేసే కార్మికులే, వ్యాపార సంస్థల నుంచి కూడా చెత్తను సేకరిస్తున్నారు. అయితే ఇప్పుడు రాంకీ సంస్థ మా విధులకు అడ్డుపడుతోంది. కాలనీలతోపాటు కమర్షియల్ ఏరియాలు కూడా విధిగా స్వచ్ఛ కార్మికులే చెత్త సేకరించేలా చూడాలని కమిషనర్‌కు విన్నవించారు. రాంకీ సంస్థ వచ్చి కమర్షియల్ ఏరియాల్లో, హాస్పిటళ్లలో, హోటళ్లలో చెత్త సేకరణ చేసినందుకు జీతాలు అందజేస్తామని, వ్యాపార సంస్థల నుంచి చెత్త సేకరణకు డబ్బులు వసూలు చేయరాదని ఆంక్షలు విధిస్తుంది.'' అని వాపోయారు. తమ సమస్య పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో రాంపల్లి సూరన్న, ఎత్తిరి గోపి, బీ.రామాంజనేయులు, చిన్న నర్సింహ, రంగనాయకులు, తిరుమలేష, గుడిమల్కాపూర్ యాదగిరి, దేవా, మధు తదితరులు ఉన్నారు.



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న అడిషనల్ కమిషనర్, సిబ్బంది

నిబద్ధత, అంకితభావంతో గుర్తింపు

అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్

జీహెచ్ఎంసీలో 13 మంది ఉద్యోగుల పదవీ విరమణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ప్రతి ఉద్యోగికి విధి నిర్వహణలో అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ కేటగిరీలలో పనిచేసిన 13 మంది ఉద్యోగులకు.. ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం పదవీ విరమణ వీడ్కోలు సభను నిర్వహించారు. వారిని ఘనంగా సన్మానించిన అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలోఎంతో నిబద్ధత, అంకితభావంతో సేవలందించారన్నారు. వారి శేష జీవితం సుఖ సంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, ఏఎంసీలు జీవన్ కుమార్, శారద, సహ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య మాజీ రాష్ట్ర చైర్మన్ పిట్టల రవీందర్

వెంకటపల్లి, ఏప్రిల్ 30: మత్స్య సొసైటీల జలవనరులకు సరిపడేంత ఉచిత చేపపిల్లల కోసం సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని, మే 15న జరిగే మత్స్యకారుల మహాధర్నా జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య మాజీ రాష్ట్ర చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మత్స్యకార సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పిట్టల రవీందర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది 2025-26 సంవత్సరంలో మత్స్యకారుల కోసం కేటాయించే బడ్జెట్ 100% ఉపయోగపడే విధంగా ఉచిత చేప పిల్లల కోసం కేటాయించే నగదును మత్స్య సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమం చేసిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ నుంచి ఒక్క పైసా ఉచిత చేప పిల్లలకు కేటాయించలేదని, కేటాయించిన డబ్బులు కూడా బ్రోకర్లకు అవినీతి అధికారుల కమీషన్లకు ఉపయోగపడే విధంగా అమలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది రాష్ట్రంలో మత్స్య సొసైటీ జలవనరులకు సరిపడేంత ఉచిత చేపపిల్లల కోసం సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియాలను వెంటనే అందించాలని, మత్స్యకారుల సమస్యలపై మే 15న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మత్స్యకారుల మహాధర్నాలో భారీగా మత్స్యకారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిల భారత మత్స్యకారులు మత్స్య సమాఖ్య జాతీయ కార్యదర్శి కార్మిక లెల్లెల బాలకృష్ణ, సమన్వయకర్తగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ వ్యవహరించగా.. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మెట్టు ధనరాజ్, జాతీయ మత్యకారుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు విజయ్ కుమార్, గంగపుత్ర సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు గరిగే శ్రీహరి, మెట్టు వెంకటేశం,నాయకులు గాండ్ల అమరావతి, పంపరి మంజుల, నర్సింగరావు, కాడబోయిన నర్సింగ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కేబీఆర్ పార్క్.. పెండింగ్ మార్క్

(మొదటిపేజీ తరువాయి)

సమర సింహారెడ్డి, షబ్బీర్ అలీ, కేఈ కృష్ణమూర్తి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, హీరో అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి 205 గజాల స్థలాన్ని కోల్పోగా, అల్లు అర్జున్ మరో బంధువు శరత్‌కి చెందిన 134గజాల స్థలాన్ని కోల్పోనున్నారు. ఇక సీవీఆర్ సంస్థ 480 గజాల స్థలాన్ని కోల్పోవాల్సి వస్తుండటంతో ప్రాజెక్టు భూసేకరణ కొలిక్కి రావడం లేదు. బంజారాహిల్స్ రోడ్ 12 విరంచి ఆసుపత్రి నుంచి అగ్రసేన్ చౌరస్తా వరకు ప్రస్తుతం 80 అడుగుల రోడ్డు ఉంది. దీనిని 100 అడుగుల మేర విస్తరించనున్నారు. ఈ రోడ్డుకు రెండు వైపులా ఆస్తులు సేకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే 86 నివాసాలకు మార్కింగ్ చేశారు. కానీ ఇప్పటివరకు ఏ ఒక్క ఆస్తిని కూడా అధికారులు స్వాధీనం చేసుకోలేదు. కానీ ప్రాజెక్టును నిలవరించేలా కోర్టులను ఆశ్రయించే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. రెండు ప్యాకేజీల్లో కేబీఆర్ పార్క్ ఎంట్రెన్స్ గేటు నుంచి జూబ్లీ చెక్ పోస్టు వరకు, బసవ తారకం హాస్పిటల్ మీదుగా అగ్రసేన్ విగ్రహం మీదుగా అండర్ పాస్, ఫ్లైఓవర్లను రూ. 1090 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు టెండర్లు పిలవగా, మార్చి 26తో ప్రక్రియ ముగిసింది. టెండర్ కమిటీ దశలో ఉంది. త్వరలో టెండర్‌ను ఖరారు చేసిన భూ సేకరణపై స్పష్టత లేకుంటే పనులు జరపలేని పరిస్థితి నెలకొంది.

ప్రాజెక్టు విశేషాలు..

కేబీఆర్ పార్కు చుట్టూ అగ్రసేన్, ఫిలింనగర్, క్యాన్సర్ హాస్పిటల్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం ఇలా ఆరు జంక్షన్లు ఉన్నాయి. ఈ ఆరు జంక్షన్లలో 8 స్టీల్ బ్రిడ్జిలు, ఆరు అండర్‌పాస్‌ల నిర్మాణం జరగనుంది. జూబ్లీహిల్స్ జంక్షన్, కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ వద్ద రెండు చొప్పున నాలుగు స్టీల్ బ్రిడ్జిలు రానున్నాయి. మిగతా నాలుగు జంక్షన్ల వద్ద ఒక్కో స్టిల్ బ్రిడ్జి, ఆరు జంక్షన్ల వద్ద ఒక్కొక్కటి చొప్పున ఆరు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు నుంచి రోడ్డు నంబర్ 45 వైపు వచ్చే ఫ్లై ఓవర్‌పై భాగంలో రెండు లేన్లతో రానుంది. కేబీఆర్ పార్కు నుంచి రోడ్ 36 వైపు వెల్లే నాలుగు లేన్ల కింద నుంచి వెళ్లనుంది. ఈ నిర్మాణాలతో కేబీఆర్ పార్కు గ్రీనరీపై ప్రభావం పడుతుందని గతంలో పలువురు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించడం, పర్యావరణ వేత్తలు వ్యతిరేకిస్తుండడం, వీరికి తోడుగా భూ బాధితులు న్యాయస్థానాల్లో పిటిషన్లు వేస్తుండడం ఈ ప్రాజెక్టు ఇప్పట్లో ముందుకు పోయే పరిస్థితులు కనబడటం లేదు.

హైదరాబాద్ సాహిత్యానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు

ఓటీఏ అధ్యక్షుడు మహమ్మద్ ఖురేషి

కవి సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 30: తెలంగాణ సాహిత్యంతో పాటు ముషాయిరాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించేలా'అందాజ్ ఏ హింద్' పేరుతో జూన్ 15న హైదరాబాద్‌లో ముషాయిరా, కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఓవర్సీస్ తెలంగాణ అసోసియేషన్స్ (ఓటీఏ) అధ్యక్షుడు మహమ్మద్ ఖురేషి తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లోని మార్క్స్ మీడియా సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో అమెరికా, కెనడా, మధ్య ఆసియా దేశాలలో అనేక సాంస్కృతిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటామన్నారు. హైదరాబాద్ సాహిత్యానికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సాహితీ వారసత్వాన్ని కాపాడటంతోపాటు సేవా కార్యక్రమాలలో తమ సంస్థ చురుగ్గా ఉందన్నారు. జూన్ 15న ముషాయిరాతో పాటు వివిధ రంగాల్లో సేవలందించిన వారికి అవార్డులు కూడా అందిస్తామన్నారు. 'అందాజ్ ఏ ముషాయిరా' పేరుతో బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహిస్తున్న కవి సమ్మేళనంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పేరు మోసిన కవులు తమ కవిత్వాలతో అలరించనున్నారన్నారు. ఈ సందర్భంగా అందాజ్ ఏ హింద్ కవి సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అతిథులతో కలిసి ఖురేషి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ హెచ్ సంస్థ అధ్యక్షుడు డా.సుజాత్ అలీ, ఇర్ఫాన్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు సరిపోతలేవు

ప్రణాళిక లేకుండా మహాలక్ష్మి పథకం అమలుతో అవస్థలు

గ్రేటర్‌లో రెండున్నర రెట్లు పెరిగిన ప్రయాణికులు

కిక్కిరిసిపోతున్న బస్సులు, ఫుట్‌బోర్డు ప్రయాణం

వచ్చే విద్యా సంవత్సరం నాటికి 200 నూతన బస్సులు కావాలి

ఆర్టీసీ ఉన్నతాధికారులకు గ్రేటర్ అధికారుల ప్రతిపాదనలు

ప్రభుత్వం నుంచి కొరవడిన స్పందన

హైటెక్‌సిటీ ఇనార్బిట్‌మాల్ సమీపంలో బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల అవస్థలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఒక ప్రణాళిక లేకుండా కాంగ్రెస్ సర్కార్ మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడంతో బస్సుల కొరతతో గ్రేటర్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిపడా బస్సులు లేకపోవడం, సమయానికి బస్సులు రాకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. మహిళలకు ఉచిత బస్సు పథకంతో గ్రేటర్‌లో ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అయ్యింది. ఈ పరిస్థితుల్లో బస్సుల సంఖ్య పెంచకపోవడం ఇప్పుడు ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. వచ్చే అరకొర బస్సుల్లోనే ప్రయాణికులు కిక్కిరిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కాగా, తక్షణ అవసరం దృష్ట్యా 200 బస్సులను గ్రేటర్‌కు అందించాలని గ్రేటర్ అధికారులు.. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. కాగా ఇప్పటికే విద్యార్థులు, ప్రయాణికులు లక్ష సంతకాల ఉద్యమం చేసి బస్సుల సంఖ్య పెంచాలని అధికారులకు విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొత్తగా 200 బస్సులు కావాలని అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాకపోవడంతో వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికైనా నూతన బస్సులు వచ్చే సూచనలు కనిపించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బస్సుల సంఖ్య పెంచాల్సిందే..!

గ్రేటర్‌లో ఉచిత బస్సు పథకం అమలుకు ముందు రోజుకు 11 లక్షల మంది ప్రయాణం చేసేవాళ్లు. ఇందులో మహిళా ప్రయాణికులు సుమారు 5 లక్షల దాకా ఉండేవాళ్లు. అయితే మహాలక్ష్మి ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చాక బస్సుల్లో ఇప్పుడు రోజుకు సుమారు 24 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. ఇందులో 17 లక్షల మంది మహిళలే ఉండటం విశేషం. అయితే ఇంతమంది ప్రయాణభారం గ్రేటర్‌లో ఉన్న 2,600 బస్సులపైనే ఆధారపడి ఉంది. దీంతో ప్రతీ బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోతోంది. ఈ క్రమంలో బస్సుల సంఖ్యను పెంచాల్సిందే అంటూ ప్రజలనుంచి నిత్యం ఆర్టీసీ అధికారులకు వినతులు వెల్లువెత్తుతున్నాయి.

టికెట్ల జారీ, డ్రైవింగ్ కత్తిమీద సామే..

ఈ క్రమంలో కండక్టర్లకు టికెట్లు జారీ చేయడం, ఆధార్ నంబర్లను సేకరించడం అనేది కత్తిమీద సాములాంటిదే. ఇదే క్రమంలో నగరంలో బస్సు నడపాలంటే ఎంతో ఓపిక ఉండాలి. నిత్యం రోడ్లపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతీ నాలుగు, ఆరు నిమిషాలకు ఓ స్టాప్ వస్తూనే ఉంటుంది. రద్దీ రోడ్లపై ఇలా ప్రతీ స్టాపు వద్ద ఆపుకుంటూ మళ్లీ డ్రైవ్ చేస్తూ గమ్య స్థానానికి చేరుకోవాల్సి ఉంటుంది. కొన్ని రూట్లల్లో రోడ్లు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటాయి. మరికొన్ని రూట్లలో రోడ్లు చిన్నగా ఉంటాయి. వీటన్నింటి మధ్య డ్రైవర్ బస్సు నడుపుతూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తుంటారు. బస్సుల సంఖ్య పెంచితే ఇటు ప్రయాణికులకు అటు ఆర్టీసీ సిబ్బందికి క్షేమదాయకంగా ఉండనుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 500 ఎల్క్ట్రిక్ బస్సుల్లో సికింద్రాబాద్ రీజియన్‌కు 400 బస్సులు కేటాయించారు. అందులో 111 ఎల్క్ట్రిక్ బస్సులు ఇప్పటివరకు అందుబాటులోకి వచ్చాయి. ఇంకా 289 బస్సులు రావాల్సి ఉన్నవని అధికారులు తెలిపారు.